క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో సాయినాథుడు

మనుబోలు : మనుబోలులోని పిడూరురోడ్డులో ఉన్న శిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం సాయినాథునికి విశేష పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు సాయినాథునికి అభిషేకాలు జరిపించి పుష్పాలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం సాయినాథునికి పల్లకిసేవ చేశారు. ఆర్.సుధీర్‌కుమార్–రాగపూజిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

బాబా మందిరంలో..

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

కుర్చీల వితరణ



కొడవలూరు : మండలంలోని గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు నార్తురాజుపాళెం ఆర్‌ఎస్‌ఆర్ జూనియర్ కళాశాల వారు పది కుర్చీలను వితరణగా ఇచ్చారు. వీటిని కళాశాల చైర్మన్ సీహెచ్.రవీంద్రనాథ్‌రెడ్డి గురువారం పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సి.హరినాథరాజు, అధ్యాపకుడు రామనారాయణ, హైస్కూల్ హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రాజా సుధాకర్, పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేస్తా



సురేంద్రబాబును సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తోటపల్లిగూడూరు : వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ ప్రెసిడెంట్‌గా తను నియమించిన పార్టీ అధిష్టానానికి, తనను ప్రతిపాదించిన మంత్రి కాకాణికి రుణపడి ఉంటానని, వారి నమ్మకం వమ్ము కాకుండా బాధ్యతగా పనిచేస్తానని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు పేర్కొన్నారు. మండలంలోని కోవెరపాళెంలో ఉన్న తన నివాసంలో గురువారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్రబాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చే విజ్ఞప్తులకు సంబంధించి జిల్లా అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారాని కృషి చేస్తానన్నారు. మంత్రి కాకాణితో పాటు తన నియామకానికి తోడ్పాటు అందించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి రుణపడి ఉంటానన్నారు. అనంతరం స్థానిక నేతలు సురేంద్రబాబును సన్మానించారు. ముత్యాల సుధాకర్, కరివేటి శ్రీనివాసులు, తలమంచి సునీల్, వినయ్ పాల్గొన్నారు.

వేరుశనగ నూర్పిళ్లు ప్రారంభం

• ఆశాజనకంగా కొనుగోలు ధరలు



యంత్రంతో వేరుశనగ నూర్పిళ్లు చేస్తున్న కూలీలు

ముత్తుకూరు : మండలంలో వేరుశనగ పంటకు సంబంధించి నూర్పిళ్లు ప్రారంభమయ్యాయి. ఈ రబీ సీజన్‌లో సుమారు 350 ఎకరాల్లో శనగ సాగు చేపట్టారు. ముత్తుకూరు, నారికేళపల్లి, పంటపాళెం, మామిడిపూడి, పిడతాపోలూరు, ఈపూరు, దొరువులపాళెం పంచాయతీల్లో ప్రారంభించిన సాగు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనసాగింది. సాగునీటి కొరత లేకుండా, చీడపీడల బెడద లేకుండా విజయవంతంగా కోతలు, నూర్పిళ్ల దశకు చేరింది. వ్యవసాయాధికారుల అంచనా ప్రకారం.. ఈ సీజన్‌లో ఎకరాకు 25 నుంచి 26 బస్తాలకుపైగా దిగుబడి వచ్చింది. గత సంవత్సరం ఎకరాకు 30 బస్తాలకుపైగా దిగుబడి వచ్చింది. మార్చిలో ఎకరాకు 40 బస్తాలు దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు అభిప్రాయపడుతున్నారు. కొనుగోలు ధర మాత్రం బస్తా(41 కిలోలు) రూ 3,500లు పలుకుతోంది. గత సంవత్సరం బస్తా ధర కేవలం రూ.3,200లకే పరిమితమైంది. గత నవంబర్, డిసెంబర్‌లో కురిసిన వర్షాల వల్ల దిగుబడి కాస్త తగ్గిపోయినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

కలల సౌధం పేదల సొంతం

ఎంతో కాలంగా అద్దె ఇళ్లల్లో కాలం వెళ్లదీస్తున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం బాసటగా నిలుస్తోంది. వారికి స్థలం ఇవ్వడంతో పాటు ఇల్లు మంజూరు చేసి, కావాల్సిన మెటీరియల్‌తో పాటు నగదును సమకూరుస్తుండడంతో పేదలు ధైర్యంగా కలల సౌధాన్ని నిర్మించుకుంటున్నారు.

- జగనన్న కాలనీల్లో వేగంగా ఇళ్ల నిర్మాణాలు
- మంత్రి కాకాణి, అధికారుల కృషితో పనులు వేగవంతం



వెంకటాచలంలోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఇల్లు

వెంకటాచలం: మండలంలో నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా మొత్తం 4,022 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసింది. 36 లేఅవుట్లలో 1,665 మంది లబ్ధిదారులు, సొంత స్థలాల్లో 3,357 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు. జగనన్న కాలనీల్లో లేఅవుట్లు వేసి, రోడ్లు, తాగునీరు సదుపాయాలు ముందుగానే కల్పించడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను ఉత్సాహంగా ప్రారంభించారు. ప్రభుత్వం నాణ్యమైన మెటీరియల్‌ను సరఫరా చేస్తుండడంతో కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పోటాపోటీగా సాగుతున్నాయి.

పేదలకు ఆర్థిక చేయూత

ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం అందించే రూ.1.80 లక్షలకు తోడు పేద లబ్ధిదారులకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఆర్థిక చేయూతను అందించారు. పొదుపు గ్రూపుల్లో సభ్యులుగా ఉన్న లబ్ధిదారులకు రూ.30 వేలు వడ్డీలేని రుణం ఇప్పించడంతో పాటుగా, మండలంలో ఇళ్లు నిర్మించుకునే ఎస్టీ లబ్ధిదారులకు రూ.15 వేల ఆర్థిక సాయం అందించేలా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విశేష కృషి చేశారు.

నిర్మాణాలు వేగవంతం

మండలంలోని వెంకటాచలం, ఎర్రగుంట, సర్వేపల్లి, పూడిపర్తి, కసుమూరు తదితర ప్రాంతాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. వెంకటాచలంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, వైఎస్సార్‌సీపీ నేత మందల పెంచలయ్య దగ్గరుండి పేదల ఇళ్ల నిర్మాణ పనులు చేయిస్తున్నారు. ఒక్కో ఇంటికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు తమ సొంత నిధులను లబ్ధిదారులకు అందించి ఉగాదిలోగా 120 ఇళ్లు పూర్తి చేయించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. మండలంలో గృహ నిర్మాణశాఖ అధికారులు, సిబ్బంది నిరంతరం జగనన్న కాలనీలను సందర్శిస్తూ ఉగాది నాటికి 660 ఇళ్లు పూర్తి చేయించి గృహ ప్రవేశాలు జరిగేలా శ్రద్ధ చూపుతున్నారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మందల వెంకటశేషయ్య

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



తమ సొంతింటి కల నెరవేర్చుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తమ కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటాం. అన్ని వసతులు కల్పించి, ఇంటి స్థలం ఇవ్వడమే కాకుండా, ఇల్లు కూడా మంజూరు చేయడంతో చాలా సంతోషంగా నిర్మాణ పనులు చేసుకుంటున్నాం. మాకు ఇళ్ల మంజూరులో మంత్రి కాకాణి కృషి ఎనలేనిది.

– ఎస్‌కే. రేష్మ, వెంకటాచలం

ఉగాది నాటికి లక్ష్యం పూర్తి

ఉగాది నాటికి జగనన్న కాలనీల్లో ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేలా కృషి చేస్తున్నాం. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో లబ్ధిదారులు శరవేగంగా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. పేద లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు మంత్రి కాకాణి చేసిన కృషిని తాము ఎప్పటికీ మర్చిపోలేం.

– సీహెచ్.వెంకటేశ్వర్లు, గృహనిర్మాణశాఖ, ఏఈ

నాణ్యమైన మెటీరియల్ అందుతోంది



జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇవ్వడమే కాకుండా ఇల్లు కూడా మంజూరు చేయించారు. నిర్మాణానికి అవసరైన నాణ్యమైన ఇసుక, సిమెంట్, స్టీల్ సరఫరా చేయడంతో వేగంగా ఇంటి పనులు ప్రారంభించాం. కాలనీలో పేదలందరూ ఇళ్లు నిర్మించుకునేలా అధికారులు, స్థానిక నాయకులు ప్రోత్సహిస్తున్నారు. సొంతింటి కల సాకారం చేస్తున్న జగనన్నకు రుణపడి ఉంటాం.

– శింగంశెట్టి సుప్రియ, వెంకటాచలం

వేగంగా ఆధార్ అనుసంధానం

• జెడ్పీ సీఈఓ చిరంజీవి



మాట్లాడుతున్న సీఈఓ చిరంజీవి

బుచ్చిరెడ్డిపాళెం: ఓటుకు ఆధార్‌ను అనుసంధానం కార్యక్రమాన్ని వేగంగా చేయాలని జెడ్పీ సీఈఓ చిరంజీవి ఆదేశించారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం బీఎల్వోలు, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ అనుసంధానంలో బుచ్చిరెడ్డిపాళెం వెనుకంజలో ఉందని, దీనిపై దృష్టి సారించి ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఇంటి, కుళాయి పన్నులను త్వరగా వసూలు చేయాలన్నారు. సమీక్షలో ఎంపీడీఓ నరసింహారావు, తహసీల్దార్ పద్మజ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

వెంకటాచలం : మోటార్‌బైక్ అదుపుతప్పి పడడంతో యువకుడు గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. నెల్లూరు నగరం కిసాన్‌నగర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ పని నిమిత్తం బైక్‌పై కసుమూరుకు వచ్చాడు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా మలుపురోడ్డు వద్ద ఎదురుగా టిప్పర్ అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో సయ్యద్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతులు బాగుంటే టీడీపీకి నచ్చదు



ఉలవరపల్లిలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ధాన్యానికి గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయని, దీని వల్ల రైతులు బాగుంటే తెలుగుదేశం పార్టీ నాయకులకు నచ్చడం లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ప్రభగిరిపట్నం, ఉలవరపల్లి గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంత్రి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.1.11 కోట్లతో నిర్మాణాలు పూర్తి చేసుకున్న సైడ్‌డ్రెయిన్లు, సిమెంటు రోడ్లు, కాకాణి రమణారెడ్డి మినరల్ వాటర్‌ప్లాంట్, విలేజ్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. స్వీట్ లెస్(తెలంగాణ మసూర) వరి ధాన్యానికి పుట్టి ఒక్కటింటికి రూ.20 వేల నుంచి రూ.20,500 వరకు ధర గిట్టుబాటు అవుతున్నట్లు తెలిపారు. ఈ స్థాయిలో ధాన్యానికి గిట్టుబాటు ధరలు లభించిన దాఖలాలు లేవన్నారు. ఎన్నికల కమిషన్ సమ్మతిస్తే ఈనెల 27వ తేదీన రైతుభరోసా నగదు జమ చేస్తామన్నారు. తమ ప్రభుత్వం రైతు సంక్షేమం కోరుకునే ప్రభుత్వమని, అందువల్లే ప్రకృతి కూడా సహకరిస్తూ వరుసగా వర్షాలు కురిసి రైతుల పంటలు పండుతున్నట్లు తెలిపారు. ధాన్యం అమ్ముడుపోకుంటే టీడీపీ నాయకులు ప్రభుత్వంపై బురద చల్లేందుకు సిద్ధంగా ఉన్నారని, అయితే వారికి అవకాశం లేకుండా పోయిందన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సుగుణమ్మ, సర్పంచ్ పి.వెంకమ్మ, నేతలు పి.పెంచలప్రసాద్, జి.విజయ, జి.చిన్నయ్య, రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపటిలోగా ఈ–కేవైసీని పూర్తి చేయాలి



ఇందుకూరుపేట : మాట్లాడుతున్న ఏడీ రాజ్‌కుమార్

ఇందుకూరుపేట : ప్రస్తుత రబీ సీజన్‌కు సంబంధించి ఈ–కేవైసీ నమోదును ఈనెల 25వ తేదీలోగా పూర్తి చేయాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు రాజ్‌కుమార్ సూచించారు. స్థానిక ఏడీ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ఇందుకూరుపేట, తోటపల్లి గూడూరు, ముత్తుకూరు మండలాలకు చెందిన వ్యవసాయ శాఖ అధికారులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడతూ ఈ–కేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే రాబోయే సీజన్లో ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని, వ్యవసాయ శాఖ పథకాలకు అర్హులని తెలిపారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించి నూరుశాతం పూర్తి చేయాలని ఏడీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓలు, ఏఈఓలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.



కొడవలూరు : క్షేత్రస్థాయిలో పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ లక్ష్మి

పంట నమోదు చేయించుకోవాలి

కొడవలూరు : రైతులు వెంటనే పంట నమోదు చేయించుకోవాలని ఏఓ సీహెచ్ఎస్.లక్ష్మి కోరారు. మండలంలోని నార్తురాజుపాళెంలో పంట నమోదు కార్యక్రమాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 65 శాతం మంది రైతులు మాత్రమే పంట నమోదు చేసుకున్నట్లు వివరించారు. ప్రస్తుతం గడువు పొడిగించినందున రైతులు సద్వినియోగం చేసుకుని వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. వరి కోతలు సమీపిస్తున్న నేపథ్యంలో రైతులు త్వరపడి పంట నమోదు చేయించుకోవడంతో పాటు ఈ–కేవైసీ చేయించుకోవాలని చెప్పారు. ఏఓ వెంట వీఏఏ అభిజ్ఞాన ఉన్నారు.

గిరిజనుల శ్మశాన స్థలం పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : మండలంలోని ముదివర్తి పంచాయతీలో గాంధీ గిరిజన కాలనీకి చెందిన శ్మశాన స్థలాన్ని రాష్ట్ర యానాదుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, రెవెన్యూ అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ గతంలో పెన్నా పోరంబోకులో యానాదులకు శ్మశానం కోసం 7.80 ఎకరాల స్థలాన్ని కేటాయించారని, ఇందులో దాదాపు 50 సెంట్ల భూమి ఆక్రమణకు గురైనట్లు స్థానిక గిరిజనులు గుర్తించి తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. విడవలూరు తహసీల్దార్, కావలి ఆర్డీఓ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లామని, దీంతో రెవెన్యూ అధికారులు ఇక్కడికి చేరుకుని ఆక్రమణకు గురైన యానాదుల శ్మశాన స్థలాన్ని గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారన్నారు. అలాగే శ్మశాన స్థలం చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో యానాది సంక్షేమ సంఘ నాయకులు శ్రీనివాసులు, సతీష్‌చంద్ర, రమేష్, ఉష, పోలయ్య, వెంకయ్య, మాధవి, ఆర్‌ఐ రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యానాది సంక్షేమ సంఘ నేతలు

నేత్రపర్వంగా శ్రీవారి రథోత్సవం

• భారీగా తరలివచ్చిన భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని రామకృష్ణనగర్‌లో కొలువైన కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సప్తమ వార్షికోత్సవాల్లో భాగంగా అత్యంత కీలక ఘట్టమైన రథోత్సవాన్ని గురువారం నేత్రపర్వంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి అందంగా ముస్తాబై రథోత్సవంలో పురవీధుల్లో సంచరించారు. ఈ సందర్భంగా దేవదేవేరులను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో పాటు, మహిళలు, భక్తులు స్వామివారు కొలువైన రథంపై మిరియాలు, ఉప్పును చల్లారు. అంతేకాకుండా ఆచార సాంప్రదాయాలను అనుసరించి గుమ్మడి కాయలు, టెంకాయలను పగులకొట్టారు. భక్తుల కోలాటం, వేంకటేశ్వరస్వామి వేషధారణతో చిన్నారులు చేసిన నృత్యం ఆకట్టుకున్నాయి. భక్తులకు అడుగడుగున మజ్జిగ, తాగునీరును దాతలు ఏర్పాటు చేశారు. రాత్రి స్వామివారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో గన్నవరంలోని భువనేశ్వరి పీఠం అధిపతులు కమలానంద భారతి పాల్గొని రథోత్సవాన్ని ప్రారంభించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు సీఐలు రామారావు, రామకృష్ణారెడ్డి, ఎస్సైలు వీరప్రతాప్, సుబ్బారావు, ఆంజనేయులు బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బుచ్చి చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, ఉభయ కర్తలు, పాలకమండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.



జనసమూహం మధ్య తరలుతున్న రథోత్సవం, (ఇన్‌సెట్లో) స్వామి, అమ్మవార్లు



వేంకటేశ్వస్వామి వేషధారణలో నృత్యం చేస్తున్న చిన్నారులు

వ్యక్తిపై దాడి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఘటన మండలంలోని దండిగుంటలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ మేరకు విడవలూరు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై ఆంజనేయులు కథనం మేరకు.. దండిగుంట గ్రామంలో కొందరు సరదగా ఆటలు ఆడుతుండగా గ్రామానికి చెందిన మేకల శీనయ్య వెళ్లాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న దండిగుంట ధనంజయ ఎందుకు వచ్చాయని అడిగాడు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో శీనయ్య ఓ కర్రను తీసుకుని ధనంజయ తలపై దాడి చేశాడు. దీంతో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. అనంతరం శీనయ్య కుమారుడు ఏసోబు కూడా కర్రతో ధనంజయ కాళ్లపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో క్షతగాత్రుడిని కుటుంబసభ్యులు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. దాడి ఘటనకు సంబంధించి శీనయ్య, ఏసోబుపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై ఆంజనేయులు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని విడవలూరు ఎస్సై ఆంజనేయులు కోరారు. విడవలూరులోని పీఆర్ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జిల్లాను డ్రగ్స్ రహితంగా మార్చే విషయంలో విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుజాత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఏవీ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వసతుల కల్పనపై దృష్టి పెట్టండి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : మండలంలోని 15 పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టి పెట్టాలని ఎంపీడీఓ సుబ్రమణ్యం పేర్కొన్నారు. విడవలూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ భవానమ్మ అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం సమీపించడంతో తాగునీటి సమస్య రాకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే ఇంటి, కుళాయి పన్నులపై దృష్టి పెట్టి వాటిని నూరుశాతం వసూలు చేసే విధంగా కృషి చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల లక్ష్మయ్య, వైస్ ఎంపీపీలు సౌందర్య, శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రమణ్యం

వెంకటేశ్వరలో ఏఐ ల్యాబ్ ప్రారంభం

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటెల్ కంపెనీ ఆధ్వర్యంలో జిల్లాలో తొలిసారిగా కృత్రిమ మేధ(ఏఐ) ల్యాబ్‌ను ప్రారంభించారు. విర్ట్‌జన్ జాన్‌డీర్ సీఈఓ రమేష్ పాలగిరి చేతుల మీదుగా గురువారం ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కంపెనీ సామాజిక బాధ్యత నిధుల నుంచి రూ.28 లక్షలు విరాళమివ్వగా, కళాశాల యాజమాన్యం మరో రూ.12 లక్షలు జోడించి శిక్షణా సంస్థను ఏర్పాటు చేసిందన్నారు. డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, ఐఓటీ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. కళాశాల చైర్మన్ పెనుబల్లి బాబునాయుడు, రైతు సంఘ రాష్ట్ర నేత సీహెచ్.కోటిరెడ్డి, ప్రిన్సిపల్ పి.కుమార్‌బాబు, డైరెక్టర్లు పి.కృష్ణ చైతన్య, చంద్రమౌళి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్ పాలగిరి

తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి

• ఏడీఏ రాజ్‌కుమార్

తోటపల్లిగూడూరు : ప్రస్తుత రబీ సీజన్‌లో వరిపంటపై ఉధృతంగా ఉన్న కంకినల్లి తెగులు నివారణకు రైతులు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కోడూరు బిట్–1 గ్రామంలో గురువారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కంటికి కనబడని సూక్ష్మసాలీడు వర్గానికి చెందిన పురుగులతో కంకినల్లి ఏర్పడుతుందన్నారు. దీనిని గుర్తించిన 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు ప్రొఫెనోఫాస్ అనే మందును ఎకరానికి 400 ఎంఎల్ లేదా డైకోఫోల అనే మందును ఎకరానికి 1000 ఎంఎల్ వంతున పిచికారీ చేసుకోవాలన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి గీతాకుమారి, వ్యవసాయ సహాయకులు దయానా, శశి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రాజ్‌కుమార్